క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించనున్నారు. వైశాఖ మాసం బహుళ షష్ఠి తిథి నేపథ్యంలో నిర్వహించనున్న ఈ పూజలకు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుల బృందం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం తదితర పూజలను చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన



నేలటూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం: బాలికలకు రుతు క్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించాలని శ్రమ స్వచ్ఛంద సంస్థ కో- ఆర్డినేటర్ నాగేశ్వరి అన్నారు. రుతుక్రమ పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని నేలటూరు, అంగర, కపిలేశ్వరపురం, మాచర, వల్లూరు గ్రామాల్లో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల వైద్య, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు.

లెక్కల పరీక్షకు 125 మంది గైర్హాజర్

మండపేట: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం లెక్కలు పరీక్ష నిర్వహించారు. మండలం, పట్టణానికి చెందిన మొత్తం 245 మంది టెన్త్ విద్యార్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉందని ఎంఈఓ నాయుడు రామచంద్రరావు తెలిపారు. అయితే 120 మంది విద్యార్థులు లెక్కల పరీక్షకు హాజరైనట్టు ఆయన తెలిపారు. ఇందులో 125 మంది గైర్హాజరైనట్టు చెప్పారు. కాగా ఇప్పటి వరకూ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి పరీక్షలకు హాజరైన వారికంటే గైర్హాజరు శాతం ఎక్కువగా కనిపిస్తోంది.

స్కూటర్ అపహరణ

మండపేట: పట్టణంలోని 21వ వార్డు రావులపేట వీధిలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. ఇక్కడి రామాలయం ఎదురుగా ఉండే వీధిలో నివాసం ఉంటున్న తొగర దొరబాబుకు చెందిన యాక్టివ్ స్కూటర్‌ను అర్ధరాత్రి ఎవరో అపహరించుకు పోయారు. స్కూటర్ యజమాని దొరబాబు ఆ రోజు రాత్రి తన పని ముగించుకుని ఇంటి ఎదురుగా పార్క్ చేసి ఉంచానని చెప్పారు. ఉదయం లేచి చూసేసరికి తన స్కూటర్ కనిపించకుండా పోయిందన్నారు. దీనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు.

ఎన్టీయార్‌కు నివాళి

మండపేట: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతిని మంగళవారం ఆ పార్టీ మండపేట కార్యాలయంలో కార్యకర్తలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకుడు శెట్టి రవికుమార్, టీడీపీ నాయకులు చుండ్రు శ్రీవరప్రకాష్, వుంగరాల రాంబాబు, చాపల వీరబాబు, ముమ్మిడివరపు నారాయణ, షేక్ ఇబ్రహీం, సల్మాన్ హుస్సేన్, బొడ్డు రామక్రిష్ణ, చింతల శ్రీనివాస్, సాధనాల చక్రపాణి, వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామరావు జయంతిని గొల్లపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుబాష్ సుబాష్ పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

రామచంద్రపురం: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఇతర పార్టీ నేతలు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

కన్నుల పండువగా వెంకన్న రథోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంక బిళ్లవారి వీధిలో పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. బిళ్లవారి వీధి నుంచి ప్రారంభమైన రథోత్సవం ఎగ్జిబిషన్ వీధి, వీరభద్రస్వామి గుడి సెంటర్, హైస్కూల్ సెంటర్, మురుగులమ్మ గుడి సెంటర్ మీదుగా కాపటి వీధి, శివాలయం వీధి వరకూ సాగింది. రథోత్సవంలో దారి పొడవునా అధిక సంఖ్యలో మహిళలు ఎదురొచ్చి మంగళ హారతులు పట్టారు. రథోత్సవంలో ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమ భారతి, చందన శంకరరావు, జాన గణేష్, శ్రీనివాస బాలమిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం గిరి, కాసిన ప్రసాద్, బళ్ల సత్తిరాజు పాల్గొన్నారు.

ధాన్యాన్ని.. దాచుకుందాం ఇలా

- నిల్వ చేసినపుడు తేమ, శిలీంధ్రాలు, పురుగులు, పక్షులు, ఎలుకలతో ముప్పు
- జాగ్రత్తలు పాటిస్తే నష్ట నివారణ



కొప్పిశెట్టి ప్రభాకర్

రాయవరం: అరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాని సమయంలో రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకుంటారు. కొందరు రైతులు మంచి ధర వచ్చే వరకు నిల్వ చేస్తే, మరి కొందరు రైతులు విత్తనాల కోసం, భవిష్యత్తు అవసరాల కోసం ధాన్యాన్ని నిల్వ చేసుకుంటారు. ప్రస్తుతం రబీ వరికోతలు పూర్తయ్యాయి. ఈ సమయంలో కొందరు రైతులు పండిన ధాన్యాన్ని విక్రయించుకుంటుంటే, మరికొందరు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని నిల్వ చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ధాన్యం నిల్వ చేసుకునే సమయంలో తేమ, శిలీంధ్రాలు, పురుగులు, పక్షులు, ఎలుకల వలన ధాన్యంలో తరుగు వచ్చే అవకాశం ఉంది. ధాన్యం నిల్వ చేసుకునే సమయంలో రైతులు ఈ కింది జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచిస్తున్నారు.

నిల్వ ధాన్యాన్ని ఇవి ఆశిస్తాయి

నిల్వ ధాన్యాన్ని ఆశించే పురుగుల్లో ముఖ్యమైనవి వడ్ల చిలుకలు, ముక్కు పురుగు, నుసి పురుగులు. గోదాము చిలుకగా పిలిచే వడ్ల చిలుకలు గోధుమ రంగు ఆకారంలో ఉంటాయి. ధాన్యం మూటల మీద, గోడల మీద కన్పిస్తాయి. దీని లార్వా మాసిన తెలుపురంగులో ఉండి ధాన్యాన్ని బొరియలు చేసుకుని లోపలి పదార్థాన్ని తినేస్తుంది. ముక్కు పురుగులు చింతగింజ రంగులో ఉంటాయి. ప్రౌఢ, లార్వా దశల్లో ఉన్న ఈ పురుగులు ధాన్యాన్ని ఆశించి లోపలి అంకురాన్ని తినడం వల్ల ధాన్యం విత్తనానికి పనికి రాకుండా పోతుంది. నుసి పురుగునే రైతులు పుచ్చు పురుగు అని కూడా అంటారు. ప్రౌఢ, లార్వా దశలు రెండూ నష్టం కలిగిస్తాయి. ప్రారంభ దశలో చెత్తను తర్వాత గింజల పై పొరను, ఆ తర్వాత లోపల బియ్యపు గింజలను తింటూ నష్టం కలిగిస్తాయి. ఎర్రపెంకు పురుగులు గోధుమ రంగులో ఉండి ఎక్కువగా పిండి, రవ్వ, తవుడు వంటి మరపట్టిన పదార్థాలను ఆశించి నష్టం కలిగిస్తాయి. నిల్వ ఆహార ధాన్యాలను ఎలుకలు నేరుగా తినడమే కాకుండా పరోక్షంగా తిన్నదాని కంటే ఆరు రెట్లు వాటి విసర్జకాలు, వెంట్రుకలతో కలుషితం చేస్తాయి.



నిల్వ చేసేందుకు ముందుగా ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గోదాముల లోపల పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా చూడాలి. నిల్వ చేసే ముందు గోదాముల్లోని గోడలు, నేలపై పగుళ్లు, రంధ్రాలను సిమెంట్‌తో పూడ్చాలి. కిటికీలు, వెంటిలేటర్ల నుంచి పక్షులు జొరబడకుండా ఇనుప జాలీలు బిగించాలి. నేల గోడలు, పైకప్పుపై మలాథియాన్ 50 ఈసీ మందును 1:100 నిష్పత్తిలో లీటరు నీటికి 10 మిల్లీ లీటరు లేదా డైక్లోరోవాస్ 76 ఎస్‌సీ లీటరు నీటికి 7.0 మిల్లీ లీటరు లేదా డెల్టామెత్రిన్ 2.5 డబ్ల్యూపీ లీటరు నీటికి 1.5 గ్రాముల చొప్పున కలిపి 100 చదరపు మీటర్ల విస్తీర్ణానికి మూడు లీటర్ల చొప్పున పిచికారీ చేయాలి. ధాన్యం నిల్వకు సాధ్యమైనంత వరకూ కొత్త గోనె సంచులను ఉపయోగించాలి. ధాన్యం వేసే ముందు గోనె సంచుల మీద, లోపల మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేసి వాటిని మర్నాడు ఎండలో ఆరబెట్టి తేమ శాతం 13 లేదా అంతకంటే తక్కువగా ఉండేలా చూడాలి. ఎలుకలు చొరబడకుండా రెండు అడుగులు ఎత్తుగల మెట్లలా పునాదులు నిర్మించాలి. గోడలు, నేల నుంచి బస్తాలకు తేమ తగలకుండా వాటిని గోడలకు దూరంగా చెక్కదిమ్మలు, లేదా చెక్కబల్లలపైన మెట్లు వేయాలి. ధాన్యంపైన ఎప్పుడూ నేరుగా పురుగు మందును చల్లరాదు. అప్పుడప్పుడు మలాథియాన్ ద్రావణాన్ని 1:100 నిష్పత్తిలో బస్తాల మీద, గోడల మీద పిచికారీ చేస్తూ ఉండాలి. నిల్వ ధాన్యంలో ఏమైనా కీటకాలు ఉన్నట్టు గమనిస్తే వాటి నివారణకు గోదాములలోనికి గాలి ప్రవేశించకుండా చేసి అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్లల ద్వారా ఊదరబెట్టి నివారించవచ్చు. టన్ను ధాన్యానికి 3.0 గ్రాముల బిళ్లల రెండు నుంచి మూడు చొప్పున వాడాలి. గోదాముల లోనికి గాలి ప్రవేశించకుండా కనీసం వారం రోజుల పాటు తలుపులు మూసి ఉంచితే మంచిది. ఎలుకల నివారణకు బోనులతో పాటు జింక్ ఫాస్ఫైడ్ లేదా బ్రోమోడయలిన్ వంటి మందుతో విషపు ఎరలు తయారు చేసి ఉపయోగించాలి.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



దేగలపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న సూర్యప్రకాశ్

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతో మనిషి మానసిక ప్రశాంతతను పొంది సమస్యలు దూరమవుతాయని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. శలపాక శివారు దేగలపేటలో మంగళవారం గ్రామ దేవత మహాలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ తీర్థంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు దేవు నాగబాబు, సతీష్, అబ్బు, కామిరెడ్డి చక్రరావు, ఈశ్వర్రావు తదితరులు గ్రామ ముఖద్వారం వద్ద సూర్యప్రకాశ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రతివ్యక్తి భగవంతునిపై భక్తిభావాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దడాల రమేష్, జొన్నకూటి పద్మజా వెంకటేశ్వర్రావు, ఈశ్వర రెడ్డి, పృథ్వీ, దంగేటి వెంకన్న, మోకన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ వై.సూర్యనారాయణ సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగమైన మండలంలోని కుక్ కమ్ హెల్పర్స్‌కు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ ప్రారంభ సమావేశంలో ఎంఈవో సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థికీ పోషకాహారం అందించడంలో భాగంగా వారానికి ఐదు కోడిగుడ్లు, రోజు విడిచి రోజూ రాగి జావ, చిక్కీలు అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గోరుముద్దలో భాగంగా రోజుకొక మెనూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. మెనూను మరింత రుచికరంగా అందించడంలో భాగంగా తాజ్ చెఫ్‌లతో రీసోర్స్‌పర్సన్స్‌కు శిక్షణ ఇచ్చారన్నారు. మిడ్ డే మీల్ మెనూను మరింత రుచికరంగా, శుభ్రంగా అందించేందుకు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిడ్ డే మీల్ మెనూ తయారీపై ఐఎఫ్‌పీల ద్వారా వీడియోలు ప్రదర్శించి, అవగాహన కల్పించారు. వంట కార్మికులకు వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు, కంప్యూటర్ ఆపరేటర్ ఎ.కృష్ణమూర్తి, సీఆర్పీలు కె.రాములు, వైఎల్ వీర్రాజు, వి.సీతాధనలక్ష్మి, కె.సీనాసిరి తదితరులు మాట్లాడారు.



రాయవరంలో మాట్లాడుతున్న ఎంఈవో సూర్యనారాయణ

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒక రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులు, సహాయకులకు ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పించారు. జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన నిర్వాహకురాలు ఎస్.సీతారాం చే మండలంలోని నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ కె.తాతారావు పర్యవేక్షణలో నిర్వహించిన తరగతిలో మధ్యాహ్న భోజనం వండి పెట్టే క్రమంలో పాటించాల్సిన నిబంధనలు, విద్యార్థుల ఆరోగ్యం, నిర్వాహకులకు అందజేసే సదుపాయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీ గుబ్బల వేణుగోపాల్, ఎంఐఎస్ టి.సురేష్, సీఆర్పీలు కొండేటి సరిత, శీలం వెంకటేష్, నామాడి శ్రీను, సీఓ వి.సత్యనారాయణ, ఎమ్మార్సీ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

వెదురుపాకలో ఘనంగా పోలేరమ్మ తీర్థం

రాయవరం: మండలంలోని వెదురుపాక గ్రామంలో పోలేరమ్మ వారికి మంగళవారం భక్తులు నీరాజనాలు అర్పించారు. అమ్మవారికి సోమవారం రాత్రి వైభవంగా జాతర నిర్వహించిన విషయం విదితమే. ఉదయం వరకు జాతర జరగ్గా అమ్మవారిని అత్తవారింటికి సాగనంపే కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. గరగల రూపంలో ఉన్న అమ్మవారిని ఎత్తుకున్న ఆసాదులు అత్తవారింటికి వెళ్లనంటూ మారం చేస్తుండగా భక్తులు వారిని బలంగా పంపే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు అమ్మవారిని మధ్యాహ్నానికి అత్తవారింటికి సాగనంపారు. జాతరను పురస్కరించుకుని గారడీలు, బ్యాండు మేళాలను ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తమ పిల్లా పాపలను, పాడిపంటలను, పసుపుకుంకాలను చల్లగా చూడాలని కోరుతూ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు.



పోలేరమ్మ వారి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

అమ్మవారికి చీరలు, రవికెల ముక్కలు అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు జాతర, తీర్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వెదురుపాక, కొంకుదురు, నదురుబాద, వి.సావరం, రాయవరం తదితర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అగ్రహారంలో కార్డన్ అండ్ సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌బాబు తదితరులు

రామచంద్రపురం రూరల్: ఎలక్షన్ ఫలితాల దృష్ట్యా బయట వ్యక్తుల ద్వారా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్టు రామచంద్రపురం సీఐ పి.దొరరాజు వెల్లడించారు. అందులో భాగంగా జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ ఆదేశాల మేరకు అంబకపల్లి అగ్రహారంలో మంగళవారం కార్డన్ అండ్ సెర్చ్‌ను నిర్వహించినట్టు ఆయన తెలిపారు. రామచంద్రపురం పోలీస్, క్యూఆర్‌టీ సిబ్బంది సహకారంతో జరిగిన తనిఖీల్లో గ్రామంలో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 9 మోటారు సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. సంబంధిత వాహనదారులు మోటారు వాహనాల రికార్డులను తీసుకురావాలని లేకుంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. అనంతరం ఎస్సై సురేష్‌బాబు గ్రామస్తులకు అవగాహన సదస్సును నిర్వహించి సూచనలు చేశారు.

అధిక వినియోగం అనర్థమే..

- విపత్తుల్యంగా పంటలు
- అనారోగ్యం బారిన ప్రజలు
- సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న వ్యవసాయాధికారులు

కాజులూరు: రోజురోజుకి వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోతోంది. ఒకప్పుడు కేవలం సేంద్రియ ఎరువులనే వినియోగించి పంటలు సాగు చేసే రైతన్నలు క్రమేపి అధిక దిగుబడి కోసం అధిక మోతాదులో రసాయన ఎరువులను వినియోగించడం ప్రారంభించారు. తెగుళ్లు, పలు రకాల పురుగుల నివారణతోపాటు పంట ధృడంగా పెరగడానికి, చివరకు కలుపు మొక్కల నివారణకు కూడా రసాయనిక మందులనే వినియోగిస్తున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా పంట విషతుల్యంగా మారి ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాము పండిస్తున్న ఆహారం కలుషితమవ్వకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గ గ్రామాల్లోని కొందరు రైతులు ఇటీవల సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి పెడుతున్నారు. తమ పశువుల శాలలోని పశువుల పేడ, చీకినగడ్డి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై తెచ్చి పొలాల్లో వేస్తున్నారు. సొంతంగా పశువులు లేని రైతులు కోళ్లఫారాల్లోని కోడి పెంట, చెరువులు, కుంటల్లోని పూడికమట్టిని కొనుగోలు చేసి మరీ పొలాల్లో వేస్తున్నారు. నియోజక వర్గ పరిధిలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన అనేక మంది రైతులు సేంద్రియ సాగు చేస్తున్నారు.



గొల్లపాలెంలో ట్రాక్టర్‌తో పశువుల పెంట తరలిస్తున్న రైతులు

సేంద్రియ ఎరువులపై దృష్టి

సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరిగి అధిక దిగుబడితోపాటు ఆరోగ్యకర పంటలు లభిస్తాయని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పంటపొలాల్లో చీడపీడలు, తెగుళ్లు తక్కువగా ఉంటాయన్నారు. పూడికమట్టి, పశువుల పేడల్లో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ పోషక విలువలు లభించడంతో పైర్లు పెరిగి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు రసాయనిక ఎరువుల తగ్గించి సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట వాడకంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.



మొగలిపాలెంలో పశువుల పెంటను ఎడ్లబండిపై తెచ్చి పొలంలో దిగుమతి చేస్తున్న రైతు

లెక్కింపు రోజు అవగాహనతో మెలగాలి

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజైన జూన్ 4న శాంతి భద్రతల విషయంలో పాటించాల్సిన నిబంధనలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహనతో మెలగాలని మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, తహసీల్దార్ రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులకు లెక్కింపు ప్రక్రియపైనా, క్షేత్ర స్థాయిలో శాంతి భద్రత పరిరక్షణకై ఉన్నతాధికారులు రూపొందించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. బాధ్యత కలిగిన నాయకులుగా కార్యకర్తలను నిబంధనలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను మీరినవారిపై చట్ట పరిధిలో కఠిత చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎం వీఎం ప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల్లోని వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ అబ్బు తదితరులు


క్షణమొక యుగంలా ఎదురుచూపులు

- ఓట్ల లెక్కింపు రోజుపైనే అందరి దృష్టి
- ఏ నలుగురు కలిసినా ఎన్నికల ఫలితాల ఊసులే

అమలాపురం టౌన్: అమలాపురం, ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులే కాదు, ఓట్లేసిన ఓటర్లు కూడా వచ్చే నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు రోజు కోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురు చూస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ ఏ నలుగురు కలిసినా మాటలన్నీ ఎన్నికల ఫలితాల ఊసులే అవుతున్నాయి. విజయం తమదంటే తమదన్న వాదన రెండు పార్టీల అభ్యర్థుల మధ్య సాగుతుంది. అయితే జిల్లాలో అత్యంత కీలకమైన ఈ రెండు నియోజకవర్గాల్లో వార్ వన్ సైడేనని రాజకీయ విశ్లేషకులు సైతం బలంగా చెప్పలేకపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనంత పోటీ ప్రస్తుత ఎన్నికల్లో నెలకొందని, పైగా ఈ దఫాలో ఓటరు నాడి సైతం ఎవరికీ అంతు బట్టడం లేదన్న చర్చ సర్వత్రా సాగుతుంది.

ఎవరి ధీమా వారిదే

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఓ మున్సిపాలిటీ, ఓ నగర పంచాయతీతో పాటు 127 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటికే వైఎస్సార్ సీపీ అభ్యర్థులైన మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు ఏఏ గ్రామాల్లో ఎంతెంత ఓటింగ్ నమోదైంది, ఎంత మేర తమకు ఓట్లు పడ్డాయో అంచనాలు వేసుకుని ఎక్కడెక్కడ ఎంత మెజార్టీ వస్తుందో లెక్కలు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులతో పాటు కార్యకర్తలు సైతం తమ అధినేత జగన్ చేసిన మంచి పనులే దీవెనలై అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేశారన్న విశ్వాసం, నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ప్రత్యర్థి పార్టీకి చెందిన అభ్యర్థులైన అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబులైతే అసలు లెక్కలే అవసరం లేదని, కూటమి బలంతో తమ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలైతే రెండు నియోజకవర్గాల్లో సోషల్ మీడియాలో తమకు అనుకూలంగా వస్తున్న రీల్స్, మెసేజ్‌లు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీయేనా?

రెండు నియోజవర్గాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ(నెక్ టు నెక్) జరిగిందని రాజకీయ విశ్లేషకులంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. ఎవరు గెలిచినా 2,000 నుంచి 6,000 వేల ఓట్ల మెజార్టీతోనే గెలవొచ్చని స్పష్టం చేస్తున్నారు. పైగా ప్రధాన పోటీదారుల మధ్య ఓటింగ్ శాతంలో వ్యత్యాసం సైతం ఎక్కువ ఉండదన్నది వారి అంచనా.. కూటమి ప్రభావంతో మూడు పార్టీలు కలిశాయి కాబట్టి ఈసారి విజయం తమదేనని రెండు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, ప్రజలకు చేరిన సంక్షేమ ఫలాలు, అన్నింటికి మించి ముఖ్యమంత్రి జగన్‌పై ఉన్న నమ్మకం, విశ్వాసంతో తమను మళ్లీ విజయాన్ని అందిస్తాయని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. పైగా సైలెంట్ ఓటింగ్ తమకు అనుకూలమంటే తమకే అనుకూలమని ఇరు పార్టీల అభ్యర్థులు వాదిస్తున్నారు. ఈ స్పష్టత కోసమే వచ్చే నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు కోసం అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.